రౌండ్‌టేబుల్ సమావేశం

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 3: జగిత్యాల జిల్లా ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు జవ్వాజి శంకర్ ఆధ్వర్యంలో సోమవారం టీయూఎఫ్ కార్యాలయంలో ఉద్యమకారుల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ఉద్యమకారులందరికీ 250గజాల ఇంటి స్థలం, ₹25వేల పింఛన్, ప్రభుత్వ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఎన్నికల హామీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేయాలని, ఉద్యమకారులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉద్యమకారుల సంఘ ప్రతినిధి నాచుపల్లి రెడ్డి, నాయకులు రాగుల రాజు, భారతపు లింగారెడ్డి, కొండ్ర ప్రేమ్ కుమార్, జనగం రాజిరెడ్డి, తుమ్మనపెల్లి నరేశ్, గుమ్ముల అంజయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సత్వర సేవలందించాలి

మెట్‌పల్లి రూరల్: మీ సేవ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి 3: ప్రజలకు సత్వర సేవలు అందించడానికి గ్రామీణ ప్రాంతాల్లో సైతం మీ సేవ కేంద్రాలకు అధికారులు అనుమతులు ఇస్తున్నారని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. జగ్గసాగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మీ సేవ కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ముదాం సింధు-హరీశ్ దంపతులను అభినందించారు. ఇక్కడ మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, నేత ముదాం నర్సింలు ఉన్నారు. అలాగే మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌లోని లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాప నోత్సవానికి కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో నిర్వహించిన కల్యాణోత్సవం, అన్నదానంలో పాల్గొన్నారు.

మండప నిర్మాణానికి భూమిపూజ

కోరుట్ల, ఫిబ్రవరి 3: పట్టణంలోని పురాతనమైన మహాదేవస్వామి ఆలయంలో దాతల సహకారంతో నందీశ్వర ధర్మశాల మండప నిర్మాణానికి కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల సోమవారం భూమి పూజ చేశారు. ఇక్కడ ఆలయ కమిటీ అధ్యక్షుడు కిశోర్, మాజీ అధ్యక్షుడు గంగాధర్, కమిటీ సభ్యులు, తదితరులు ఉన్నారు.

బీమా చెక్కు అందజేత

మెట్‌పల్లి, ఫిబ్రవరి2: ఇబ్రహీంపట్నం మండలం కోమటి కొండాపూర్‌కు చెందిన పిట్ల నర్సయ్య ఇటీవల మృతి చెందాడు. గాయత్రీ బ్యాంకులో ఖాతాదారుడైన నర్సయ్యకు నిర్భయ సేవింగ్ కింద ₹లక్ష ఇన్సూరెన్స్ సౌకర్యం ఉన్నది. ఈ క్రమంలో సోమవారం ₹లక్ష బీమా చెక్కును ఆయన సతీమణి జయలక్ష్మికి స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల అందజేశారు. ఇక్కడ బ్యాంకు మేనేజర్ శివకుమార్, సిబ్బంది ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులు తాళ లేక..

- వేర్వేరుచోట్ల ఇద్దరు యువకుల ఆత్మహత్య
- జిల్లాలో విషాదం

వెల్గటూర్/కొడిమ్యాల, ఫిబ్రవరి 3: ఆర్థిక ఇబ్బందులు తాళలేక జిల్లాలో ఇద్దరు యువకులు సోమవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్గటూర్ మండలం అంబారిపేట గ్రామానికి చెందిన అల్లె సాగర్ (28) కు మూడు నెలల క్రితం వివాహమైంది. నెల క్రితం సాగర్ తండ్రి చంద్రయ్య ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. పెండ్లితోపాటు చంద్రయ్య గల్ఫ్ వెళ్లేందుకు ₹5లక్షల నుంచి ₹6లక్షల వరకు అప్పు అయింది. అప్పులు తీరే మార్గంలేక సాగర్ మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉమాసాగర్ తెలిపారు.

అలాగే కొడిమ్యాల మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన చిర్ర సంతోష్(25) గతంలో స్థానిక పెట్రోల్ బంక్‌లో పని చేసి మానేశాడు. వచ్చే నెలలో ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. ఇదివరకే ₹3లక్షల వరకు అప్పు ఉండడం, గల్ఫ్‌కు వెళ్లిన తర్వా అక్కడ సరిగ్గా పని ఉంటుందో లేదోనని మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సంతోష్ తల్లి మల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తునట్లు హెడ్ కానిస్టేబుల్ సౌందర్య తెలిపారు.

అర్జీలకు ప్రాధాన్యమివ్వాలి

జగిత్యాల రూరల్: ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

- పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలి
- కలెక్టర్ బీ సత్యప్రసాద్

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 3: ప్రజావాణికి వచ్చిన అర్జీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి.. క్షేత్ర స్థాయిలో వెంటవెంటనే పరిష్కారం చూపాలని కలెక్టర్ బీ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు బీఎస్ లత, గౌతమ్‌రెడ్డితో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అధికారులు ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించి, పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, పెండింగ్‌లో ఉంచవద్దని ఆదేశించారు. కాగా, ప్రజావాణికి మొత్తం 32ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవోలు మధుసూదన్, జివాకర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో హన్మంతరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ స్థానాలు పెంచాలి

ధర్మపురి, ఫిబ్రవరి 3: బుగ్గారం మండలంలో పరిపాలన సౌలభ్యం కోసం ఎంపీటీసీ స్థానాలను పెంచాలని మండల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ సత్యప్రసాద్‌కు నేతలు వినతిపత్రం అందజేశారు. ఇప్పటివరకు ఆరు ఎంపీటీసీ స్థానాలు ఉండగా, ప్రజల కోరిక మేరకు వాటి సంఖ్యను తొమ్మిదికి పెంచాలని కోరారు. ఇక్కడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గాలిపెల్లి మహేశ్, ఆయాగ్రామాల ప్రజలు ఉన్నారు.

ఇండ్ల పట్టాలు ఇప్పించండి..

మాది జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి అనుబంధ గ్రామమైన బావోజిపల్లె. గ్రామంలో కొన్నేండ్ల క్రితం ప్రభుత్వ సుమారు 160 ఇండ్లు నిర్మించుకున్నాం. ఇండ్ల పట్టాలు, ఇంటి నంబర్లు లేవు. తాము క్రమంతప్పకుండా కరెంట్ బిల్లు, నల్లా బిల్లు, గర్‌పట్టీలు కడుతున్నాం. గతంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లిన సమస్య పరిష్కారం కాలేదు. వెల్దుర్తి నుంచి బావోజిపల్లెకి రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. తమకు ప్రత్యేక గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయండి.

- బావోజిపల్లె గ్రామస్తులు, వెల్దుర్తి అనుబంధ గ్రామం, (జగిత్యాల రూరల్ మండలం)

రిజర్వేషన్ కల్పించాలి

దేశాయిపేటలో 40ఏండ్ల నుంచి స్థానిక సంస్థల ఎన్నికలకు ఎస్సీ మాదిగ రిజర్వేషన్ రాలేదు. రిజర్వేషన్లకు మా కులానికి కల్పించాలి. గ్రామంలోని 804, 890 సర్వే నంబర్‌లో తమ లావాణి పట్టా భూములను ఫారెస్ట్ అధికారులు తీసుకున్నారు. మా భూమిని మాకు ఇప్పించండి.

- దేశాయిపేట గ్రామస్తులు (భీమారం మండలం)

ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగం కీలకం

పోలీస్ మీట్‌లో మెడల్స్ సాధించిన పోలీసులను అభినందిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 3: పోలీస్‌శాఖలో ఆర్మ్‌డ్ విభాగం పాత్ర చాలా కీలకమని ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బంది మొబిలైజేషన్ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించగా, ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై, గౌరవ వందనాన్ని సమర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణలో సివిల్ పోలీసులతోపాటు ఏఆర్ విభాగం సైతం బందోబస్తు, ఎన్నికల నిర్వణ, గణేశ్ నిమజ్జనం వంటి విధుల్లో భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. ఇక్కడ ఏఆర్ భీమ్‌రావు, ఆర్ఐలు కిరణ్‌కుమార్, రామకృష్ణ, వేణు, ఆర్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, తదితరులు ఉన్నారు.

ఎస్ఐ కుటుంబానికి సాయం

2012బ్యాచ్‌కు చెందిన ఎస్ఐ రాజమౌళి అనారోగ్యంతో 2018లో మృతిచెందగా, బాధిత కుటుంబానికి అదే బ్యాచ్‌కు చెందిన ఎస్ఐలు (ఏపీ, టీజీ) సోమవారం ఎస్పీ అశోక్ కుమార్ చేతుల మీదుగా ₹4లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఇక్కడ జగిత్యాల టౌన్, జగిత్యాల రూరల్, మల్యాల సీఐలు వేణుగోపాల్, కృష్ణారెడ్డి, రవి, ఆర్ఐలు వేణు, రహీం, తదితరులు ఉన్నారు.

ప్రతిభ చూపిన వారికి అభినందన

కరీంనగర్‌లో జరిగిన తెలంగాణ 3వ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్-2025లో ప్రతిభ కబర్చిన పోలీసులను ఎస్పీ అశోక్ కుమార్ సోమవారం తన చాంబర్‌లో అభినందించారు. రజత పతకాలు సాధించిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రాజు(హ్యామర్ త్రో), ఏఆర్ కానిస్టేబుల్ సాయి మాధవన్(యోగా), బ్రౌంజ్ మెడల్ సాధించిన ఏఆర్ కానిస్టేబుల్ తూడి మల్లేశం, వెయిట్ లిఫ్టింగ్‌లో సిల్వర్, పవర్ లిఫ్టింగ్‌లో బ్రౌంజ్ మెడల్ సాధించిన ఏఆర్ కానిస్టేబుల్ డీ నరేందర్‌ను సత్కరించారు. ఇక్కడ ఏఎస్పీ ఎస్పీ భీమ్‌రావు, ఆర్ఐలు కిరణ్‌కుమార్, రామకృష్ణ, తదితరులు ఉన్నారు. అదే విధంగా కోరుట్ల పట్టణానికి చెందిన అబ్దుల్ జలీల్ 20రోజుల క్రితం ₹1.46 లక్ష విలువైన తన ఆపిల్ 16ప్రో సెల్‌ఫోన్‌ను పోగొట్టుకోగా, సీఈఐఆర్ టెన్నాలజీ సాయంతో పట్టుకుని బాధితుడికి ఎస్పీ అశోక్ కుమార్ సోమవారం అందజేశారు.

లైంగిక దాడి కేసులో 20ఏండ్ల జైలు

జగిత్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 3: బాలికపై లైంగిక దాడి కేసులో ఒకరికి 20ఏండ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ జగిత్యాల ఫాస్ట్ ట్రాక్ కోర్టు జడ్జి నీలిమ సోమవారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల ఓ బాలికపై సుంకల శ్రీనివాస్ అత్యాచారం చేశాడు. బాధితురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు జగిత్యాల టౌన్ అప్పటి సీఐ జయేశ్‌రెడ్డి నిందితుడిపై ఫోక్సో, ఎస్సీ, ఎస్టీ అమెండ్‌మెంట్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. జగిత్యాల అప్పటి డీఎస్పీ ఆర్ ప్రకాశ్ విచారణ జరుపగా, పోలీసులు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టడంతో పీపీ రామకృష్ణారావు కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో శ్రీనివాస్‌కు 20ఏండ్ల కఠిన కారాగార శిక్షతోపాటు బాధిత కుటుంబానికి ₹2లక్షల పరిహారం అందించాలని ఫాస్ట్‌ట్రాక్ కోర్టు జడ్జి నీలిమ తీర్పునిచ్చారు. నేరస్తుడికి శిక్ష పడేలా చేసిన అప్పటి డీఎస్పీలు వెంకటరమణ, ఆర్ ప్రకాశ్, ఇన్‌స్పెక్టర్ జయేశ్‌రెడ్డి, సీఎంఎస్ ఎస్ఐ శ్రీకాంత్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, కిరణ్, శ్రీధర్, సిబ్బందిని ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

హెచ్ఎంపై ఫిర్యాదు

మల్లాపూర్, ఫిబ్రవరి 3: సాతారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం భూమేశ్వర్‌పై కలెక్టరేట్‌లో న్విహించిన ప్రజావాణిలో జంతు సంరక్షణ కమిటీ కన్వీనర్ రమేశ్ ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి, సదరు హెచ్ఎంపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మాట్లాడుతున్న మెట్‌పల్లి సివిల్ జడ్జి నాగేశ్వరరావు

అవగాహనతోనే క్యాన్సర్ దూరం

మారుతీనగర్, ఫిబ్రవరి 3: అవగాహనతోనే క్యాన్సర్ వ్యాధిని దూరం చేయవచ్చని మెట్‌పల్లి సివిల్ జడ్జి నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం మెట్‌పల్లి కోర్టు ఆవరణలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ క్యాన్సర్ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్, కల్తీ వస్తువులను వాడకుండా అవగాహన కల్పించాలన్నారు. ఇక్కడ మెట్‌పల్లి జూనియర్ సివిల్ జడ్జి అరుణ్‌కుమార్, మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, ఉపాధ్యక్షుడు రాంబాబు, న్యాయవాదులు వెంకటనర్సయ్య, శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, స్రవంతి, శంకర్‌రెడ్డి, రాందాస్, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చేరండి

పోస్టర్లను ప్రదర్శిస్తున్న కళాశాల సిబ్బంది

జగిత్యాల, ఫిబ్రవరి 3: రాబోయే విద్యా సంవత్సరంలో విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరాలని ప్రభుత్వ కళాశాల గెజిటెడ్ అధ్యాపక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే సురేందర్‌రెడ్డి కోరారు. సోమవారం ఆయన జిల్లా కేంద్రంలోని మహిళా, ఎస్‌కేఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను సందర్శించి, మాట్లాడారు. రాబోయే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులు చేరేలా అధ్యాపకులు ప్రచార నిర్వహించాలన్నారు. మండలాల వారీగా ప్రభుత్వ, ప్రైవేట్, మోడల్ స్కూళ్లను సందర్శించాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇక్కడ జిల్లా సంఘం అధ్యక్షులు డా ఏ శ్రీనివాస్, మహిళా కార్యదర్శి సంగీత రాణి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల పిన్సిపాల్, ఎస్‌కేఎన్ఆర్ ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్, అధ్యాపకులు కే రామకృష్ణ, టీ శ్రీనివాస్, జీ చంద్రయ్య, వీ వరప్రసాద్, ఎన్ వాసవి ఉన్నారు.

ఆరోగ్య కేంద్రాల తనిఖీ

పీహెచ్‌సీలో వివరాలు తెలుసుకుంటున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

సారంగాపూర్, ఫిబ్రవరి 3: సారంగపూర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బీర్‌పూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్‌ను జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ సోమవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాలని సూచించారు. దవాఖాన పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పలు సూచనలు చేశారు. ఇక్కడ మండల వైద్యాధికారి రాధ, సీహెచ్‌వో కుద్దుస్, పార్మసిస్ట్ శ్రీనివాస్, స్టాఫ్ దామోదర్, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డుకు ఎంపిక

తెలుగు బుక్ ఆఫ్ రికార్డుకు ఎంపికైన విద్యార్థినుల బృందం

మేడిపల్లి, ఫిబ్రవరి 3: మెట్‌పల్లి అంబేద్కర్ స్టేడియంలో సోమవారం తెలంగాణ భాష సాంస్కృతికశాఖ, మీనాక్షి నృత్య కళానిలయం మెట్‌పల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన 'ద్విశత పేరిణి నృత్యం'పై ఒకేసారి 216 మంది విద్యార్థినుల బృందం నృత్యం చేశారు. ఈ ప్రదర్శనను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ జ్యూరి మెంబర్ అశోక్‌కుమార్ తిలకించారు. 216 మంది విద్యార్థినులతో పేరిడి నృత్యం తెలంగాణలోనే మొట్టమొదటిసారిగా ప్రదర్శించారని కొనియాడారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డు కోసం ఎంపికైన 216మంది విద్యార్థినుల్లో భీమారం మండలం మన్నెగూడెం గ్రామానికి చెందిన గుట్ట వంశీక, వడ్లకొండ అక్షిత ఉన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు వంశీక, అక్షితలను అభినందించారు.

ఇసుక అక్రమ రవాణాను ఆరికట్టాలి

జగిత్యాల, ఫిబ్రవరి 3: ధర్మపురి, బీర్‌పూర్ మండలాల నుంచి ఇసుక అక్రమ రవాణాను ఆరికట్టాలని జిల్లా లారీ, టిప్పర్ యాజమానుల సంక్షేమ సంఘం సభ్యులు సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ధర్మపురి, బీర్‌పూర్ మండలాల్లోని గోదావరి తీరం వెంబడి గ్రామాల నుంచి ప్రతిరోజు వెయ్యి టన్నుల ఇసుక అక్రమంగా రవాణా చేయండతో ప్రభుత్వానికి కోట్లాది రూపాయల్లో నష్టం వాటిల్లుతోందన్నారు. ప్రభుత్వ ఇసుక క్వారీలలో ట్రిప్పునకు రూ.5వేల నుంచి రూ.6వేల వరకు అక్రమంగా అదనపు మొత్తం వసూలు చేయడంతో ఆ భారం వినియోగదారులపై పడుతుందన్నారు. క్వారీ ప్రాజెక్టు ఆఫీసర్లు, ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంలేదన్నారు. అలాగే సబ్‌స్టాక్ యార్డు ఏర్పాటు కోసం స్థలాన్ని గొల్లపల్లి రోడ్డులో గల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

మెట్‌పల్లి, ఫిబ్రవరి 3: పట్టణంలోని కోదండ రామాలయం సమీపంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న బొలేరో వ్యాన్‌ను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. పక్కా సమాచారం మేరకు ఎస్ఐ కిరణ్‌కుమార్ సివిల్ సప్లయ్ అధికారులతో కలిసి వాహనాల తనిఖీ చేయగా, రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యాన్ పట్టుబడింది. 25 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, వ్యాన్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వ్యాన్ యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

ఒలింపియాడ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

కోరుట్ల, ఫిబ్రవరి 3: సుచిరిండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన సర్ సీవీ రామన్ ఒలంపియాడ్ పరీక్ష ఫలితాల్లో పట్టణంలోని కోరుట్ల పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. దేశవేని ప్రణతీ రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు, క్యాతం ధనశ్రీ, సంకె కాస్పీ, అలిగేటి వేదశ్రీ, నులిగొండ శ్రీసాయి గణేశ్, మ్యాకల ప్రజ్వల జిల్లా స్థాయిలో ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ గుజ్జెటి వెంకటేశ్ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులు హైదరాబాద్‌లోని లలితా కళాతోరణంలో ఈ నెల 16న జరిగే ప్రదానోత్సవంలో మెడల్స్, ప్రశంసాపత్రాలు అందుకోనున్నట్లు ప్రిన్సిపాల్ చెప్పారు.

'లక్ష డప్పులు-వేల గొంతులు' విజయవంతం చేయాలి

కథలాపూర్: ర్యాలీ నిర్వహిస్తున్న అంబేద్కర్ మాదిగ సంఘం సభ్యులు

మేడిపల్లి, ఫిబ్రవరి3: ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 7న నిర్వహించే లక్ష డప్పులు వేల గొంతుకలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అంబేద్కర్ యువజన మండలాధ్యక్షుడు బంగారు దీపక్ పిలుపునిచ్చారు. భీమారం మండలం వెంకట్రావుపేటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం నినదించారు. ఇక్కడ ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు దోనిపాల శంకర్, నేతలు వినోద్, ప్రభాకర్, అంజయ్య, తిరుపతి, నర్సయ్య, సామిల్, నవీన్, లచ్చయ్య, ప్రశాంత్, తదితరులు ఉన్నారు.

డప్పుల చప్పుళ్లతో ర్యాలీ

కథలాపూర్, ఫిబ్రవరి 3: మండల కేంద్రంలో అంబేద్కర్ మాదిగ సంఘం సభ్యులు సోమవారం డప్పుల చప్పుళ్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు వేల గొంతుకలు కార్యక్రమానికి కులసంఘం సభ్యులు, అభిమానులు తరలిరావాలని కోరారు. మండల అధికారుల కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇక్కడ జిల్లా అధికార ప్రతినిధులు కాశవత్తుల లక్ష్మీరాజం, తెడ్డు శేఖర్, మండలాధ్యక్షుడు మారంపెల్లి వినోద్, నాయకులు శనిగారపు గణేశ్, కలికోట రాజం, నల్ల గంగాధర్, రాయికంటి శేఖర్, నీలకంఠం, ప్రశాంత్, తదితరులు ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కోరుట్ల, ఫిబ్రవరి 3: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు చేయాలనే డిమాండ్‌తో నిర్వహించ తలపెట్టిన లక్ష డప్పులు, వేల గొంతుకలు కార్యక్రమానికి సంబంధించిన ప్రదర్శన పోస్టర్లను పట్టణంలోని కొత్త బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద మాదిగ కళాకారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఇక్కడ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మారంపల్లి శ్రీధర్, ఎమ్మార్పీఎస్ పట్టణాధ్యక్షుడు మోర్తా డ్ రాజశేఖర్, డివిజన్ అధ్యక్షుడు శనిగారపు వినోద్, మండలాధ్యక్షుడు కుంటాల శ్రీను, జిల్లా అధికార ప్రతినిధి ఎర్ర శంకర్ ఉన్నారు.

గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలి

జగిత్యాల: ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌తో మాట్లాడుతున్న గ్రామస్తులు

జగిత్యాల, ఫిబ్రవరి 3: జగిత్యాల రూరల్ మండల వెల్దుర్తి అనుబంధ గ్రామమైన బావాజీపల్లిని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలనీ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను సోమవారం క్యాంప్ కార్యాలయం లో గ్రామస్తులు కలిసి వినతి పత్రం అం జేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి.. గ్రామ పంచాయతీ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు.

మద్దతు ఇవ్వండి

ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఈ నెల 7న చలో హైదరాబాద్ నిర్వహించే లక్ష డప్పులు- వేల గొంతుకల సాంస్కృతిక ప్రదర్శన, ర్యాలీకి మద్దతు ఇవ్వాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆద్వర్యంలో నాయకులు సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను క్యాంప్ కార్యాలయంలో కలిసి కోరారు. ఇక్కడ ఎమ్మార్పీస్ నేతలు దుమాల గంగారాం, బోనగిరి కిషన్, నక్క రమేశ్, దుమాల రాజ్‌కుమార్, బోనగిరి నారాయణ, దుమాలతిరుపతి, సంగెపు ముత్యం, కొల్లూరి సురేందర్, బాపూరపు గంగారాం, దాసరి సతీశ్ ఉన్నారు.

రేణుకా ఎల్లమ్మ భోనాలకు రండి..

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 3: జాబితాపూర్‌లో నిర్వహించే రేణుకా ఎల్లమ్మ బోనాలకు రావాలని గౌడ సంఘం నేతలు సోమవారం మ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను ఆయన నివాసంలో కలిసి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఇక్కడ సంఘం నాయకుడు అంకం సతీశ్‌గౌడ్, సంఘ సభ్యులు, తదితరులు ఉన్నారు.

'ఇంటర్ ప్రాక్టికల్స్' ప్రారంభం

సారంగాపూర్, ఫిబ్రవరి 3: సారంగాపూర్, బీర్‌పూర్ మండల కేంద్రాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సోమవారం ఇంటర్ సెకండియర్ (బైపీసీ) విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 19మంది విద్యార్థులకు గానూ అందరూ హాజరయ్యారు. కస్తూర్బాగాంధీ పాఠశాల ఇంటర్ విద్యార్థులు 22 మందికి గానూ 21మంది పరీక్షలకు హాజరయ్యరు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 8 మందికి గానూ అందరూ హాజరయ్యారు. బీర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 12మంది విద్యార్థులకు 9మంది ప్రాక్టికల్‌కు హాజరై, ప్రశాంతంగా పరీక్షలు రాశారు.

జీపీల్లో ఫొటో ఓటర్ జాబితా

పెగడపల్లి, పిబ్రవరి 3: మండల పర